క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత

పీహెచ్‌సీ వైద్యులు సిరిచందన



క్రోసూరు: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరిచందన పేర్కొన్నారు. సోమవారం పారుపల్లి గ్రామంలో జరుగుతున్న యాంటీ లార్వెల్ ఆపరేషన్ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి లోపల, బయట నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని.. ఫ్రైడే డ్రై డే పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



అచ్చంపేట: ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్‌లో ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆల్ ఇండియా 50వ ర్యాంక్ సాధించిన కట్టా హర్షితకు సోమవారం అచ్చంపేటలో స్నేహహస్తాలు ఫౌండేషన్ గౌరవ సలహాదారు మామిళ్లపల్లి విజయలక్ష్మి చేతులమీదుగా రూ.40 వేలు విలువచేసే ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమతులేని ఎందరో విద్యార్థులకు స్నేహహస్తాలు అండగా నిలబడటం అభినందనీయమన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకోలేని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే స్నేహహస్తాలు ఫౌండేషన్ లాంటి సేవా సంస్థలు ముందుకు రావాలన్నారు. ఆల్ ఇండియా లెవల్ 50వ ర్యాంకు సాధించడం సామాన్య విషయం కాదని, వచ్చిన అవకాశాన్ని, దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని హర్షిత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. సంస్థ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, చెరుకుంపాలెం గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్షులు తుమ్మా శౌరెడ్డి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్టు

పెదకూరపాడు: మండలంలోని కంభంపాడు గ్రామంలో పేకాట స్థావరంపై పెదకూరపాడు పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ విప్పర్ల వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంభంపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న తాటికొండ మండలం పెద్ద పరిమి గ్రామానికి చెందిన షేక్ ఖాశీం షరీఫ్, సరిపూడి నాగార్జున, పాములపాడు గ్రామానికి చెందిన చెకూరి సాంబయ్య, తుళ్ళూరు మండలం మందడం గ్రామానికి చెందిన షేక్ నాగూల్‌మీరా, అనంతవరం గ్రామానికి చెందిన నాగరాజు, అమరావతి మండలం అమరావతి గ్రామానికి చెందిన లక్ష్మీనారయణ, నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.81,525 నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు



పెదకూరపాడు(బెల్లంకొండ): మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో గల పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి వారికి సోమవారం ఏడు అభిషేకాలతో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ వచ్చే శ్రావణ మాసం శ్రవణ నక్షత్రం నాడు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

కుష్ఠు.. విస్తరిస్తోంది జాగ్రత్త!

- ఏటేటా బయటపడుతున్న కొత్త కేసులు
- కట్టడి చేసేందుకు లెప్రసీ అధికారుల చర్యలు
- ఈ నెల 18 నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 18 మంది బాధితులు



లక్కరాజుగార్లపాడులో సర్వే చేస్తున్న సిబ్బంది



ఫణిదంలో సర్వే చేస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి: పూర్తిగా తొలగిపోయినట్లు భావిస్తున్న 'కుష్ఠు' చాప కింద నీరులా విస్తరిస్తోంది. నిర్లక్ష్యం చేసిన వారి ఆరోగ్యాన్ని కబళిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టణాలు, పల్లెల్లో ఇంటింటా తిరిగి సర్వే చేస్తూ బాధితులను గుర్తిస్తున్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన సర్వే ఆగస్టు 2 వరకు కొనసాగుతుంది. వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా మందులు అందిస్తారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో కుష్ఠు వ్యాధి లక్షణాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. కొత్త కేసులు కాస్త ఆందోళన కలిగిస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రస్తుతం 18 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఆగస్ట్ 2 తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని వైద్య శాఖ భావిస్తుంది.

కుష్ఠు.. అంటువ్యాధి కాదు

కుష్ఠు అంతగా అంటువ్యాధి కాదు.. వ్యాధి సోకిన వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు మాత్రమే సంక్రమిస్తుంది. పూర్తిగా నయం కాని జబ్బేమీ కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సక్రమంగా మందులు వాడినట్లయితే కోలుకోవచ్చు అంటున్నారు. నిర్లక్ష్యం చేస్తేనే కబళిస్తుందని హెచ్చరిస్తున్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి జీవించొచ్చు. కుష్ఠు లైంగికంగానూ సంక్రమించదు. గర్భం ద్వారా పుట్టబోవు బిడ్డకు వ్యాపించదు. వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు ద్రవంతో దగ్గు లేదా స్పర్శ ద్వారా వ్యాప్తి చెందుతుంది. రోగ నిరోధక శక్తిని బట్టి 95 శాతం మందికి వ్యాధి సోకినా అభివృద్ధి చెందదు. కుష్ఠులో రెండు రకాలు

- పాసి బాసిల్లరీ వ్యాధి ఉన్న వ్యక్తి శరీరంపై ఐదు రకాల మచ్చలు ఉంటాయి.
- మల్టీ బాసిల్లరీ వ్యాధి సోకిన వ్యక్తి శరీరంపై ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటాయి. స్పర్శ ఉండదు.
- చర్మం బయాప్సీలో యాసిడ్ పాస్ట్ బాసిల్లిని కనుగొనడం వల్ల రోగాన్ని నిర్ధారిస్తారు. మల్టీ డ్రగ్స్ థెరపీతో కుష్ఠు వ్యాధిని నయం చేసుకోవచ్చు.
- పాసి బాసిల్లరీ కుష్ఠుకు ఆరు నెలల పాటు డాప్సోన్, రిఫాంపిసిన్, క్లోఫాజిమైన్ మందులతో మల్టీ బాసిల్లరీ వ్యాధిగ్రస్తులకు 12 నెలల పాటు చికిత్స అందిస్తారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో ఇళ్లు, జనాభా, కుష్ఠు కేసులు ఇలా...

మండలం	పీహెచ్‌సీలు	ఇళ్లు	జనాభా	కేసులు
సత్తెనపల్లి టౌన్	03	19,007	65,837	06
సత్తెనపల్లి రూరల్	01	20,646	74,527	03
ముప్పాళ్ళ	01	14,608	59,429	03
రాజుపాలెం	01	10,625	42,500	02
నకరికల్లు	02	16,578	69,684	04

ఎలాంటి మచ్చలు ఉన్నా నిర్లక్ష్యం చేయవద్దు



శరీరంపై ఎలాంటి మచ్చలు ఉన్నా ఇంటి వద్దకు వచ్చే సర్వే బృందానికి తెలియజేస్తే కుష్ఠు వ్యాధి అవునో కాదో గుర్తిస్తారు. కుష్ఠు వ్యాధిని అంతం చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. దీనిని అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. వ్యాధి సోకిన వారు ఎలాంటి భయాందోళన చెందకుండా జాగ్రత్తగా మందులు వాడితే నయమవుతుంది. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. ఇంటి వద్దకు వచ్చే సర్వే బృందానికి ప్రజలు సహకరించాలి. కుష్ఠు వ్యాధి ఉన్నట్టు తెలిస్తేనే నయం చేసేందుకు వీలవుతుంది. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలి.

–డి.నాగేశ్వరరావు నాయక్, డీపీఎంవో, సత్తెనపల్లి

చెరువును నింపటంలో నిర్లక్ష్య ధోరణి వద్దు

మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి



పట్టణంలోని గార్లపాడు రోడ్డులో గల చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: సాగర్ జలాలు విడుదలవుతున్న నేపథ్యంలో పట్టణంలోని గార్లపాడు రోడ్డులో గల మంచినీటి చెరువుకు సాగర్ జలాలు నింపే విషయంలో నిర్లక్ష్య ధోరణి వహించవద్దని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణ గార్లపాడు రోడ్‌లో ఉన్న రక్షిత మంచినీటి చెరువును సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సాగర్ జలాలను చెరువుకు నింపే విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. 450 హెచ్‌పీ విద్యుత్ మోటార్ పైపుల ద్వారా మంచినీటిని చెరువుకు నింపేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పట్టణ ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ డీఈ మధుసూదన్‌రావు, ఏఈ సాగర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టండి

సత్తెనపల్లి: పట్టణంలోని 17వ వార్డ్ శాలివాహన నగర్ పాత విశిష్ట స్కూల్ వెనుక వైపు కాలనీలో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం చేపట్టక పోవటంతో వర్షకాలంలో రోడ్లపై గుంతలు ఏర్పడి బురద మయంగా మారి నడవటానికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో విశిష్ట స్కూల్ వెనుక మలుపులో కనీసం వీధి లైట్లు కూడా లేకపోవడం, వీధి కుక్కల సమస్యతో రాత్రి వేళల్లో స్థానికుల రాకపోకలకు సమస్యగా ఉందన్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ షమ్మి మాట్లాడుతూ త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు తారకృష్ణ, హనిమిరెడ్డి, నరసింహారావు, సురేష్, పాపారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో పచ్చదోమ నివారణకు చర్యలు చేపట్టాలి



బలిజేపల్లి పత్తి పొలాల్లో క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

రాజుపాలెం: పత్తి పంటలో పచ్చదోమ ఎక్కువగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో పత్తి పొలాలను రైతులతో కలసి సోమవారం ఆయన సందర్శించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ పత్తి పైరులో పచ్చదోమ ఎక్కువగా ఉందని, ఇది ఆకు అడుగుభాగంలో చేరి రసం పీల్చడం వలన ఆకులు ముడుచుకుపోయి దిగుబడి భారీగా తగ్గిపోతుందని తెలిపారు. దీని నివారణకు ఎస్‌ఫేట్ 350 గ్రాములు లేదా, ఎసిటిమీప్రిడ్ లేదా థైవోమిత్తక్సమ్ 40 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలని చెప్పారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాలకు పత్తి పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని, పొలంలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు పత్తి మొక్కలో వేరు కుళ్లు, ఎండు తెగులుకు గురవుతూ ఉంటాయి. అందుకు గాను కాపర్ ఆక్సీ క్లోరైడ్ 600 గ్రాములు, 20 గ్రాముల ప్లాంటోమైసిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులకు 40 రోజులకు పైబడిన ఆకులో అక్కడక్కడ ఎర్రగా మారతాయి. దీని నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ ఎకరాకు 2 కిలోల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు తిరుముల, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

రైతు, కౌలు రైతు సంఘం నాయకులు



పెదకూరపాడు: మండలంలో కౌలు రైతులు అధికంగా ఉన్నా.. వారికి కౌలు గుర్తింపు కార్డులు అందడం లేదని, రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి కౌలు రైతుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా మంజూరు చేయాలని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రభాకరరావుకు అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలోని అనేక మంది కౌలుకు పొలం తీసుకొని సాగు చేస్తున్నారని, అర్హత ఉన్న రాయితీలు రావడం లేదన్నారు. ముందుగా కౌలు రైతులకు సమాచారం ఇచ్చి గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. భూస్వామి సంతకం లేకుండా మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు బంకా దాసు, బంకా శ్రీనివాసరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గోతుల మయంగా ఆర్ అండ్ బీ రహదారి



క్రోసూరు: వర్షాలకు రహదారులు గోతుల మయంగా మారుతున్నాయి. ఇటీవల అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్‌రోడ్డు కొరకు చేసిన పనుల్లోని క్రోసూరు నుంచి దొడ్లేరు పరిధిలో వేసిన బెడ్డింగ్ పనుల రోడ్డు గోతుల మయంగా మారింది. వర్షాలకి మొత్తం కొట్టుకుని పోయి గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో మరింత ప్రమాదకరంగా ఉంది. దీనికి తోడు పెద్దపెద్ద వాహనాలు అటుగా ప్రయాణిస్తుండటంతో రోడ్డు మరింత గోతులమయంగా మారింది. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే రోడ్డును పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలి

సత్తెనపల్లిలో న్యాయవాదులు విధుల బహిష్కరణ



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల రవి, న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, జె.విజయ్‌కుమార్, బి.ఆదినారాయణ, సయ్యద్ అబ్దుల్ రహీమ్, కళ్ళం వీరభాస్కర్ రెడ్డి, రాజవరపు నరసింహారావు, బీఎల్ కోటేశ్వరరావు, జూపల్లి శేషయ్య, చవల బాల కోటయ్య, బయ్యారపు నరసింహారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వడియాల పాపారావు, గుజ్జర్లపూడి సురేష్, రాజా విజయ్ భరత్, కృష్ణారెడ్డి, ఫాజునుల్ల, తవ్వా హరినాథ్, పిల్లి సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



బోధన సామగ్రి ప్రదర్శనలో ఎంఈవో శ్రీనివాహరావు, హెచ్‌ఎం పద్మావతి

సత్తెనపల్లి: విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2020లో జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టిందని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు అన్నారు. ఈ నూతన విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు వారం రోజులపాటు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ (విద్యావారం) పేరుతో రోజుకో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా పట్టణంలోని వెంకటపతి నగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్థానికంగా లభించే వనరులతో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన అభ్యాసన సామగ్రి ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తంగెళ్లపల్లి పద్మావతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ కార్డుల క్రమబద్ధీకరణ క్యాంప్‌లు

పి.కుసుమకుమారి, ఎంపీడీవో

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఈ నెల 27 వరకు ఆధార్ కార్డుల క్రమబద్ధీకరణ, కొత్త కార్డుల నమోదు క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో పి.కుసుమకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న తాడువాయి, అచ్చంపేట–2 గ్రామ సచివాలయాలలో క్యాంప్ జరుగుతుందన్నారు. 24న మాదిపాడు, చిగురుపాడు గ్రామాలలో, 25న చెరుకుంపాలెం, కోగంటివారిపాలెం గ్రామాలలో, 26న చల్లగరిగ, అచ్చంపేట–1 సచివాలయాలలో, 27న పుట్లగూడెం, కొండూరు గ్రామ సచివాలయాలలో క్యాంప్‌లు జరుగుతాయన్నారు. క్యాంప్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న ఆధార్ కార్డులు 10 సంవత్సరాలకు పైబడి అప్‌డేట్ చేసుకోని యెడల తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. అదే విధంగా ఆధార్ నమోదు చేసుకోని పిల్లలు ఎవరైనా ఉన్నట్లయితే వారికి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

నేటి నుండి సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు, అనంతవరం గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈనెల 27 వరకు ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కేవీ రమణ సోమవారం తెలిపారు. చిన్నారులు, పెద్దలు, యువతీ యువకులు ఎవరైనా ఆధార్‌లో కావాల్సిన మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23, 24 తేదీలు దొడ్లేరు సచివాలయం–2లో, 25, 26 తేదీల్లో దొడ్లేరు–1 సచివాలయంలో, 27వ తేదీ అనంతవరం సచివాలయంలో లేదా ఆయా గ్రామాల పాఠశాలల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఆధార్‌లో మార్పు చేర్పులను బట్టి రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఎంపీడీవో వివరించారు.

●మురుగు పారదూ.. మడుగు ఆరదూ



పెదకూరపాడులో పెద్ద మసీదు సెంటర్ వద్ద..



కాలచక్ర రోడ్డుపై గుంతలో నీరు నిల్వ ఉన్న దృశ్యం

అసలే వర్షకాలం... సీజనల్ వ్యాధులు ఒక పక్క... దోమలు మరోపక్క ప్రజలను పీడిస్తున్నాయి. అయినా పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత దర్శనం ఇస్తుంది. గత కొంత కాలంగా పెదకూరపాడు ప్రధాన రహదారి పక్కన ఉన్న పెద్ద మసీదు వద్ద ఇళ్ల నుంచి వచ్చే మురుగు సక్రమంగా పారక మసీదు సెంటర్ నిత్యం మడుగును తలపిస్తుంది. మురుగులోనే వాహనాలు నడవాల్సిన పరిస్థితితో చుట్టుపక్కల ఉన్న దుకాణాలలో మురుగు నీరు పడటంతో దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కాలచక్ర రహదారిపై పేరమ్మ వాగు వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. గుంతలో మురుగు నీరు నిల్వ ఉండి వాహనదారులు రాత్రి సమయంతో ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పెదకూరపాడు

రైతు ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: రైతు ఇంట్లో చోరీ జరిగిన ఘటన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపూడి గ్రామానికి చెందిన రైతు తూమాటి రోశయ్య కుటుంబ సభ్యులతో ఈ నెల 19న ఇంటికి తాళం వేసి కాకినాడలో నివసిస్తున్న కుమార్తె వద్దకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం గుడిపూడి తిరిగి రాగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంటి లోపల పరిశీలించగా నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు, రూ.5 వేలు నగదు, 5 పట్టు చీరలు అపహరించుకు పోయినట్లు గుర్తించారు. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శశికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ ఇంటిని పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం శిక్షార్హం



వేల్పూరులో హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తున్న సీనియర్ ప్యానల్ అడ్వకేట్ శ్రీనివాసరావు

అచ్చంపేట: హెల్మెట్ లేకుండా మోటారు వాహనాలు నడపడం ప్రమాదమే కాకుండా శిక్షార్హమని సీనియర్ ప్యానల్ అడ్వకేట్ దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేల్పూరులో సోమవారం హెల్మెట్ ప్రాధాన్యతపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి మోటారు వాహనదారుడు హెల్మెట్ పెట్టుకోవడం అలవాటుగా భావించాలన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల మనల్ని మనం రక్షించుకోవడమే కాక మనపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు రక్షణగా ఉండవచ్చన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం హెల్మెట్ లేని ప్రయాణం శిక్షార్హమని పేర్కొన్నారు. లక్షల రూపాయల వ్యయంతో బైకులు కొనుక్కునే వారు కేవలం రూ.వెయ్యికు వచ్చే హెల్మెట్ పట్ల అశ్రద్ధ చూపుతారని, దానివల్ల ఏ స్థాయిలో నష్టం కలుగుతుందో తెలుసుకోలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రమాదంలో ఏ అవయవానికి దెబ్బ తగిలినా బ్రతకొచ్చుగానీ, తలకు దెబ్బ తగిలితే కోలుకోవడం కష్టమన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ కోట బాబురావు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు బాధ్యులుగా ఉండాలి

- పులిచింత ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు
- తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు పౌర సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, ప్రజలు

పెదకూరపాడు: ఉద్యోగ విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి ప్రజలకు బాధ్యులుగా పనిచేస్తే వారు గుండెల్లో పెట్టుకుంటారని అందుకు ఉదాహరణ పెదకూరపాడు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అని పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై పెదకూరపాడు వచ్చిన తహసీల్దార్ ప్రభాకరరావు బదిలీపై తిరిగి మాతృ జిల్లా వెళ్తున్న సందర్భంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు, గ్రామస్తులు పౌర సన్మానం నిర్వహించారు. కందుల శ్రీరాములు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా బదిలీ సహజమని కానీ పని చేసే ప్రాంతంలో ప్రజలకు సేవలు అందించిన ఉద్యోగులు చిరస్థాయిగా ప్రజల మనసులో ఉంటారన్నారు. ఎన్నికల సమయంలో ఎంతో ఓర్పు, సహనంతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఎంపీడీవో మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రభాకరరావు ఎక్కడ పని చేసినా అక్కడ ప్రజల మనసులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డీటీ నిర్మలకృష్ణ, వీఆర్వోలు నరసింహారావు, జాన్‌సైదా, ప్రసాద్, శిలువరావు, పెరిక నాయుడమ్మ, బుజ్జి, మరియదాసు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుష్ఠు వ్యాధి సర్వే



కుష్ఠు వ్యాధి సర్వే కార్యక్రమంలో ఏఎన్‌ఎం

క్రోసూరు: మండలంలోని క్రోసూరు, దొడ్లేరు పీహెచ్‌సీల పరిధిలో ఈ నెల 18వ తేదీ నుంచి జరుగుతున్న కుష్ఠు వ్యాధి సర్వే కార్యక్రమం కొనసాగుతుంది. సోమవారం మండలంలోని దొడ్లేరు పరిధిలోని సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సర్వే నిర్వహించారు. ఒంటిపై స్పర్శలేని మచ్చలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. అలాంటివి ఉంటే ఎప్పటి నుంచి ఉన్నాయి, వాటి లక్షణం, దురద, ఇతర సమస్యలేమైనా ఉన్నాయా తెలుసుకుని నమోదు చేసుకుంటున్నారు. సందేహం ఉన్న వారిని వైద్యులను కలిసేలా అవగాహన కల్పిస్తున్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు కేవలం సర్వే మాత్రమే చేస్తారని, రోగి ఆసుపత్రికి వచ్చిన తరువాత వైద్య పరీక్షల తరువాత మాత్రమే నిర్ధారణ అవుతుందని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఇన్నారావు తెలిపారు.